క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో వేంచేసి యున్న భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర మాఘమాసం, శ్రవణా నక్షత్రం సందర్భంగా ఈవో కార్తీక ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి అలంకరణ చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యోగాశ్రమ శిక్షకుల రక్తదానం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణులకు అమలాపురం శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న 12 మంది రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్‌కు వీరు గురువారం వెళ్లి రక్తమిచ్చారు. యోగాశ్రమానికి చెందిన పి.సంజయ్, ఎం.కార్తీక్, బి.ధనుంజయ్, ఎల్.సుజాత, పి.అనిల్‌కుమార్, వాసంశెట్టి ప్రభాకర్, మహ్మద్ ఖాన్, ఎ.దుర్గారావు, ఎల్.చంటి, జక్కంశెట్టి సునీల్, ఎం.దుర్గారావు, ఎల్.సంజయ్ గౌడ్‌లు రక్తదానం చేశారు. రోగులు, క్షతగాత్రులకు రక్తం అత్యవసరమైనప్పుడు తమ యోగాశ్రమ శిక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముమ్మిడివరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.వెంకటాచార్య తెలిపారు. ఎంపీపీ కోలా గంగా భవానీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు, అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో విధిగా హాజరు కావాలని సూచించారు.

నగర పంచాయతీ సమావేశం నేడు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

అంతర్గత రోడ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

అమలాపురం టౌన్: పట్టణంలోని అన్ని ముఖ్య కూడళ్లతో పాటు అంతర్గత రోడ్లు, వీధుల్లో సైతం దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నేరాల నిరోధానికి, నేరం జరిగితే దర్యాప్తుకు వీలుగా పట్టణమంతా సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించే దిశగా ప్రతి అంతర్గత రోడ్ల కూడళ్లలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో ప్రధాన రోడ్లలోనే కాక మున్సిపల్ కాలనీలో 4, వంటెద్దువారి వీధిలో 3 కెమెరాలను గురువారం ఏర్పాటు చేశారు. పట్టణమంతా దాదాపు 100 సీసీ కెమెరాల ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకుని దాతలను సంప్రదిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్సై కిషోర్‌బాబుతో కలసి మున్సిపల్ కాలనీ, వంటెద్దువారి వీధుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను సీఐ, ఎస్సైలు గురువారం సాయంత్రం పర్యవేక్షించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం పరామర్శించారు. పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో భార్యా వియోగంతో బాధ పడుతున్న విలేకరి ఊడా వెంకటరమణను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట తహసీల్దార్ పితాని త్రినాధరావు, డీటీ సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కర్రాజు, జక్కల ప్రసాద్, మోర్త భైరవమూర్తి, దాసరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హీరో కొత్త స్కూటర్ ఆవిష్కరణ



హీరో కొత్త స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం టౌన్: కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన హీరో డెస్టినీ స్కూటర్‌ను జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు స్థానిక హీరో షోరూమ్‌లో గురువారం ఆవిష్కరించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పట్టణ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు సాధనాల సత్తిబాబు, షోరూమ్ యాజమాని వంకాయల రాజా పురుషోత్తమ్, పట్టణ ప్రముఖుల సమక్షంలో కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు కొత్త స్కూటర్ హీరో డెస్టినీ స్కూటర్ గురించి వివరించారు. వాహన చోదకులంతా ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి హెల్మెట్‌ను ధరించాలని సూచించారు.

ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం!

- ప్రమాదకరంగా మురమళ్ల–పల్లంకుర్రు రహదారి
- నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు
- పలువురు వాహన చోదకుల మృతి
- నిర్లక్ష్యం వీడని అధికారులు



రక్షణ గోడలు లేక ప్రమాదాలకు నిలయంగా మారిన అయినాపురం స్లూయిజ్



బైకుతో గోదావరిలోకి దూసుకుపోయి ఓ యువకుడు మృతి చెందిన స్థలం(ఫైల్)

కాట్రేనికోన: మురమళ్ల– పల్లంకుర్రు వెళ్లే పంట కాలువ వెంబడి గోదావరి రక్షణ గట్టుపై వేసిన బీటీ రోడ్డు వాహన దారులకు మృత్యుమార్గంలా మారింది. మండల ప్రజలు కాకినాడ, యానాం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గర కావడంతో బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో వాహనదారులు అధికంగా ప్రయాణిస్తున్నారు. అయితే యానాం, కాకినాడ ప్రాంతాల నుంచి మురమళ్ల ఏటిగట్టుపై వస్తున్న సమయంలో అయినాపురం స్లూయిజ్ ప్రాంతంలో రక్షణ గోడ లేక గోదావరి పంట కాలువలో పడి యువకులు దుర్మరణం పాలవుతున్నారు. మురమళ్ల–పల్లంకుర్రు రోడ్డు వెంబడి అత్యంత ప్రమాదకరమైన రెండు ఔట్ ఫాల్ స్లూయిజ్‌లు ఉన్నాయి. ఈ రెండు చోట్ల కచ్చితంగా రక్షణ గోడలు నిర్మిస్తేనే ప్రమాదాల నివారణకు ఆస్కారముంటుంది. 2007లో గోదావరి రక్షణ గట్టు ఆధునీకరణ పనులలో భాగంగా హెడ్‌వర్క్స్ నిధులు రూ.31.35 కోట్లతో అన్నంపల్లి నుంచి బలుసుతిప్ప వరకు రక్షణ గట్టు పనులు చేపట్టారు. గోదావరి కోతకు గురవుతున్న ప్రాంతం కుండలేశ్వరం వద్ద గ్రోయర్స్ నిర్మాణ పనులు చేపట్టారు. గోదావరి రక్షణ గట్టు ఆధునీకరణ పనులలో భాగంగా ఔట్ ఫాల్ స్లూయిజ్‌ల వద్ద రక్షణ గట్టు నిర్మాణంలో రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించక పోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ తరుణంలో బీటీ రోడ్డు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే దశాబ్ద కాలం గడిచినా రక్షణ గట్టుపై రోడ్డు పనులు చేపట్టలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చివరిలో బీటీ రోడ్డు పనులు చేపట్టారు.

ప్రమాదమని తెలిసినా..

మురమళ్ల నుంచి పల్లంకుర్రు వస్తున్న వాహనదారులు అయినాపురం స్లూయిజ్‌ల వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించక పోవడంతో మృత్యువాత పడుతున్నారు. పదేళ్ల క్రితం హేచరీ సీడుకు వెళ్లి వస్తుండగా ఓ వ్యక్తి మోటారు సైకిల్‌తో గోదావరిలోకి దూసుకు వెళ్లి మృతి చెందాడు. రెండు నెలల క్రితం తెల్లవారు జామున మోటారు సైకిల్‌పై వెళుతూ పంట కాలువలోకి దూసుకువెళ్లి మరో వ్యక్తి చనిపోయాడు. ఇటీవల ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వస్తూ గోదావరిలో పడిపోగా అందులో ఒకరు మృతి చెందారు. సంక్రాంతి ముందు యువకుడు మోటారు సైకిల్‌పై వెళుతూ గోదావరిలోకి దూసుకొని వెళ్లి మృత్యువాత పడ్డాడు. రక్షణ గట్టు ఆధునీకరణ పనులు చేపట్టిన సమయంలో ప్రమాదం అని తెలిసి కూడా స్లూయిజ్‌ల వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించక పోవడంతో ప్రమాదాలు జరగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గట్టు నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

రోడ్డున పడ్డ కుటుంబాలు

రోడ్డుకు రక్షణ గోడ లేక ప్రమాదంలో మృత్యువాత పడిన మృతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కుటుంబ యాజమానులను, చేతికి అంది వచ్చిన బిడ్డలను పోగొట్టుకున్న ఆ కుటుంబాలు ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఈ ప్రాంతంలో రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

అయినాపురం స్లూయిజ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిప్రాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– ఈశ్వరమణ్యం, హెడ్ వర్క్స్ ఏఈ.

సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో సీఎం రంగసామి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో వివిధ ప్రభుత్వ హైస్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు సీనియర్ ఉపాధ్యాయులకు హెడ్‌మాస్టర్ గ్రేడ్–1 గా పదోన్నతులు కల్పిస్తూ సీఎం రంగసామి గురువారం ఆదేశాలిచ్చారు. ఎంజీజీహెచ్ హైస్కూల్ నుంచి ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ నుంచి కమిడి ప్రభాకరరావు, కమలా నెహ్రూ బాలికోన్నత పాఠశాల నుంచి కె నేరళ్లలక్ష్మిలు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు. వీరితో పాటు మరో 64 మందికి గ్రేడ్–2 నుంచి హెడ్ మాస్టర్ గ్రేడ్–1 గా పదోన్నతి కల్పించారు. కార్యక్రమంలో విద్యామంత్రి నమశ్శివాయం, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై పోరాటం

పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐవీ, గోపీమూర్తి



సభలో పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులును పరిచయం చేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ పట్టభద్రులు నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై పోరాడతారని ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), బొర్రా గోపిమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో గురువారం నిర్వహించిన పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఆత్మీయ పరిచయ వేదికలో వారు మాట్లాడారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో పట్టభద్రుల వాణి వినిపించేలా గతంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన ప్రయత్నాలను వారు గుర్తు చేశారు. అనంతరం పట్టభద్రుల నియోజకవర్గానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వీర రాఘవులను ఎమ్మెల్సీలు ఐవీ, గోపిమూర్తి పరిచయం చేశారు. తనను గెలిపించాలని వీర రాఘవులు ఓటర్లను అభ్యర్థించారు. యూటీఎఫ్ కార్యకర్తగా గత 40 ఏళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా వీర రాఘవులు ఎన్నికల బరిలోకి దిగారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు కారెం వెంకటేశ్వరావు, దుర్గా ప్రసాద్, బలరామ్, కృష్ణవేణి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కేఎస్ఎస్ ప్రసాద్, గార చిట్టిబాబు, ఎస్.అరుణకుమారి, ఎస్.జ్యోతిబసు తదితరులు ప్రసంగించారు.

వాసవీమాత పూజలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అమలాపురం రూరల్: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం అమలాపురంలోని అమ్మవారి ఆలయంలో జరిగే వివిధ పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కమిటీ డైరెక్టర్ కంకటాల రామం, వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణ మూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

ఉత్తమ సేవలతోనే సంతృప్తి



సమగ్ర శిక్ష ఉద్యోగి వెంకన్నను సత్కరిస్తున్న డీఈవో డాక్టర్ సలీం బాషా తదితరులు

ముమ్మిడివరం: ఉద్యోగి జీవితంలో ప్రజలకు అందించిన సంతృప్తి కరమైన సేవలు వారి హృదయాల్లో కలకాలం నిలుస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. ఎయిమ్స్ కళాశాలలో డీఈవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మడకం చామంతి, సమగ్ర శిక్షా కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ ముగ్గుళ్ల వెంకన్నలకు గురువారం ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అయితే ఆ ఉద్యోగి సామాన్యులకు అందించిన సేవలే చిరకాలం నిలుస్తాయన్నారు. డీఈవో కార్యాలయ ఏడీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమమంతరావు, సమగ్ర శిక్షా ఈఈ సుబ్బరాజు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ భాను, ఏఎస్‌వో డి.తాతారావు తదితరులు చామంతి, వెంకన్నలు అందించిన సేవలను ప్రశంసించారు.

రక్షిత పథకం నిర్మాణాన్ని అడ్డుకోవడంపై ఆందోళన

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి అగ్రహారంలో రక్షిత మంచి నీటి ట్యాంకును నిర్మాణం చేస్తుంటే కొంతమంది వ్యక్తులు అడ్డుకున్నారని గురువారం కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మిస్తుంటే కొంతమంది అడ్డుకోవడం తగదని వెంటనే పనులు ప్రారంభించాలని సర్పంచ్ పెద్దిరెడ్డి రాము ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో ఓహెచ్ఆర్ ట్యాంకు మంజూరు చేస్తే పనులు నిలిచిపోయాయని మరలా రెండోసారి గ్రామంలో మరో ప్రాంతంలో నిర్మాణం ప్రారంభిస్తుంటే కొంతమంది అడ్డుకోవడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావుకు ఈ సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కేతా దుర్గారావు, పెద్దిరెడ్డి శ్రీరామ్మూర్తి, చొల్లంగి సాయిబాబా, మేడిచర్ల ఆదినారాయణ, పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళా మృతులకు నివాళి



మహా కుంభమేళా మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న అమలాపురం వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో సుమారు 30 మంది భక్తులు మృత్యువాత పడిన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ అమలాపుం హెల్త్ వాకర్స్ క్లబ్‌కు చెందిన వాకర్స్ స్థానిక గడియారం స్తంభం సెంటరులో కొవ్వొత్తుల ర్యాలీతో గురువారం రాత్రి నివాళులర్పించారు. తొక్కిసలాట మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తొక్కిలలాటలో గాయపడిన దాదాపు 60 మంది భక్తులు తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మహా కుంభమేళాకు సంబంధించి మిగిలిన రోజుల్లో అంతా క్షేమంగా పుణ్య స్నానాలు చేసి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రార్థనలు చేశారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివ రామకృష్ణ, వాకర్స్ ప్రతినిధులు వై.సత్యనారాయణమూర్తి, చింతలపూడి సత్తిబాబు, నూకల సత్యనారాయణ తదితరులు మృతులకు నివాళులు అర్పించారు.

కోడింగ్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన



శిక్షణ పొందిన విద్యార్థులతో ఎన్ఐటీ ప్రొఫెసర్ నాగరాజు

తాళ్లరేవు: ఇంజినీరింగ్ విద్యలో కోడింగ్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై నాగాలాండ్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగరాజు అవగాహన కల్పించారు. పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో నెల రోజులుగా నిర్వహించిన వర్క్‌షాప్ గురవారంతో ముగిసింది. ఇంజినీరింగ్ విద్యలో కోడింగ్ స్కిల్స్ ఆవశ్యకత అనే అంశంపై నాగారాజు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగావకాశాలు ఉండేవని, అయితే ప్రస్తుతం టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరిగిన కారణంగా ఉద్యోగం సాధించడం సంక్లిష్టంగా మారిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ఎంపిక విధానంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. దానికి తగ్గట్టుగా విద్యార్థులు తయారు కావాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి పైడా యాజమాన్యం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ సత్యశ్రీరామ్, డీన్ వీరభద్రరావు, డీడీ రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, రీసెర్చ్ హెడ్ డాక్టర్ వంశీ అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ రాజేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



కల్పవృక్ష వాహనోత్సవంలో భక్తజనం

యానాం: యానాంలో కొలువైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రాంభమయ్యాయి. వచ్చే నెల 17 వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఖండవిల్లి రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు మానేపల్లి శివ తెలిపారు. గురువారం కల్పవృక్షం వాహనోత్సవం ఘనంగా జరిపారు. 31న పుష్పక వాహనోత్సవం, ఫిబ్రవరి 1న మయూర వాహనోత్సవం, 2న పుష్పక వాహనం, 3న హరిణి వాహనం, 4న సింహ వాహనం, 5న పుష్పక వాహనం, 7న అశ్వ వాహనోత్సవం, 8న నంది వాహనం, ధ్వజారోహణ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. స్వామివారి కల్యాణం 9వ తేదీన రాజా మన్యం కనకయ్య జమీందారు కుమారుడు ఫణికుమార్ దంపతుల ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. 9న గజవాహనం, 10న కామధేను వాహనం, 11న రథయాత్ర, 12న త్రిశూల స్నానం, 13 నుంచి 17 వరకు శ్రీ పుష్పయాగాలు జరుగుతాయని వివరించారు.

జాతిపిత ఆశయ సాధనకు కృషి

- పలుచోట్ల గాంధీజీ వర్ధంతి
- హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు
- తాళ్లరేవులో స్వచ్ఛతతో యువకుల నివాళి



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ వీరబాబు, వైశ్య సంఘ నాయకులు



తాళ్లరేవులో గాంధీజీ వర్ధంతి సందర్భంగా బస్‌షెల్టర్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

అమలాపురం టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరు, కన్యకా పరమేశ్వరీదేవి కల్యాణ మండపంలో గల గాంధీ విగ్రహాలకు గురువారం ఘన నివాళులర్పించారు. గడియారం స్తంభం సెంటరులో గల గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి పట్టణ సీఐ పి.వీరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గాంధీజీ దేశం కోసం చేసిన త్యాగాలు, సేవలను గుర్తు చేశారు. పట్టణ వైశ్య సంఘం నాయకులు ప్రసంగించారు. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, సంఘ ప్రతినిధులు వెంకట్రామయ్య, వంకాయల కాశీ, వరదా సూరిబాబు, కొమ్మూరి ప్రసాద్, అప్పన వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆ క్లబ్‌ల ప్రతినిధులు గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకర్స్ క్లబ్‌ల అధ్యక్షులు బోణం సత్యవర ప్రసాద్, యర్రమిల్లి అనంతలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు రంకిరెడ్డి కాశీ, తేతల సత్యనారాయణరెడ్డి, కుడుపూడి త్రినాథ్, పుత్సా కృష్ణ కామేశ్వర్, వలవల నాయుడు తదితరులు ప్రసంగించారు.

స్వచ్ఛతతో నివాళులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లోని బస్ షెల్టర్ గత కొన్ని రోజులుగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో అపరిశుభ్రంగా తయారైంది. గురువారం జాతిపిత గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు స్వచ్ఛ భారత్ నిర్వహించి బస్‌షెల్టర్‌లోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. బస్ షెల్టర్ ప్రాంగణంలో ఉన్న మహాత్ముని విగ్రహంతో పాటు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ ప్రెసిడెంట్ కూర్మదాసు భారతి, సెక్రటరీ చెక్కా సువర్ణ, ట్రెజరర్ వరదా జయశ్రీ, పసలపూడి విశ్వనాథం, అద్దేపల్లి సత్తిరాజు, పేకేటి సతీష్, కొత్త సుభాష్, కూర్మదాసు శ్రీను, అద్దేపల్లి శ్రీనివాస్, తాతాజీ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముమ్మిడివరం లంక తల్లమ్మ గుడివద్ద గల గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ పేరుతో చేపడుతున్న ఆందోళనకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

గాంధీజీ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

యానాం: దేశ స్వాతంత్రోద్యమ పోరాటంలో గాంధీజీ అహింసా యుత పోరాటం చేసి బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుంచి భారతావనిని విముక్తి చేశారని ఆయన పోరాటం నేటి యువతకు ఆదర్శనీయమని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీరోడ్డులో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. బొటానికల్ గార్డెన్‌లో గాంధీ కాంస్య విగ్రహానికి సైతం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పీఆర్‌ఏ కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

5వేల టన్నుల బియ్యం అవసరం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీకి నెలకు 5వేల టన్నుల బియ్యం అవసరమవుతాయని గురువారం అధికారులు తెలిపారు. నగదు బదిలీ విధానాన్ని రద్దుచేసి నెలవారీ ఉచిత బియ్యం పంపిణీ పునః ప్రారంభానికి చర్యలు తీసుకున్నామన్నారు. నాలుగు నెలల పాటు పంపిణీ చేసేందుకు బియ్యాన్ని సేకరించిన తర్వాత 10 కేజీల సంచుల్లో ప్యాక్ చేసి పీడీఎస్ అవుట్ లెట్లలో సులువుగా పంపిణీ చేస్తామన్నారు. అక్రమాలను నివారించేందుకు ప్రభుత్వ ముద్రతో కూడిన పాలీ ప్రొపైలిన్ సంచుల్లో బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బీపీఎల్ కార్డులకు రెండు, ఏపీఎల్ కుటుంబాలకు ఒకటి చొప్పున 10 కేజీల బియ్యం సంచులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 3.54 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నట్లు తెలిపారు.